

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

చిత్తూరు తిరుపతి

సోమవారం 5 మే 2025 | పేజీలు 8

# భానుడి భగ..భగ..



కొబ్బరి బొండాలకు యమ డిమాండ్..

పశువులకు తాగునీటి సమస్యలు

పళ్ల రసాలకు పెరుగుతున్న డిమాండ్

**ఉమ్మడి తిరుపతి జిల్లాలో వేసవి విశ్వరూపం ప్రదర్శిస్తోంది. రెండు వారాలుగా తారాస్థాయిలో ఎండలు కాయడంలో ప్రజలు విలవిలలాడి పోతున్నారు. మూగజీవాలు ఎండలకు తాళలేక సొమ్మసిల్లిపోతుండగా, పలువురు ఎండల కారణంగా వడ దెబ్బ తగిలి ఆసుపత్రులలో చేరి చికిత్స పొందుతున్నట్లు ఆయా ప్రాంతాలలో వైద్యులు తెలియచేస్తున్నారు. ఎండవేడిమి ఏప్రిల్ నెలలోనే జిల్లాలో అధికంగా 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:**

ప్రజలు ఎండల వేడిమిని తట్టుకోలేక విలవిలల్లాడుతున్నారు. ఉదయం 9 గంటలనుంచే ఎండల వేడిమికి వేడి గాలులు రావడం గమనార్హం. సాయంత్రం 5.30 గంటలకు ఎండలేక పోయినా వేడి గాలులు మాత్రం వీచడంతో ఇళ్లలో ఫ్యాన్లు వేసుకున్నవారు కూడా వేడిగాలులు కారణంగా ఫ్యాన్‌లు కూడా ఆపేయవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ్యంగా వాహనాలు నడిపే వారి అవస్థలు మరీ వర్ణనాతీతం. ఆర్టీసి బస్సులు నిడిపే డ్రైవర్లు అనేక మంది ఎండల ధాటిని ఈ సంవత్సరం తట్టుకోలేక సెలవులు పెట్టి పోతున్నామని తెలియచేస్తున్నారు. ఉదయం తాము చల్లని నీరు బాటిల్స్ తీసుకువచ్చినప్పటికీ, మధ్యాహ్నం 12 గంటలకే ఆ నీరు వేడక్కిపోతోందని, తిరుపతి నుంచి బయట సుదూర ప్రాంతాలకు నడిపే బస్సు డ్రైవర్లు మధ్యలో రెండు, మూడు సార్లు నీటితో ముఖం కడు గుకుని, చల్లనినీరు తాగవలసి వస్తోందంటున్నారు. ఉదయం 9గంటలు దాటి నప్పటినుండి రోడ్లపై నడిచి వెళ్లే వారు ముఖాలకు వేడి తగలకుండా టోపీలు ధరించడం, తువ్వాళ్లు, గొడుగులు, మహిళలు చున్నీలు



వంటివి ముఖంపై వేసుకుని రోడ్లపై నడవవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. ఉదయం 11గంటలకు పట్టణాల్లో, పలుప్రాంతాలలో ఎండ వేడిమికి తిరిగ కుండా జనం బాగా తగ్గిపోతున్నారు, ఒకవేళ రోడ్లపై వెళ్లినప్పటికీ, అనేకమంది చల్లని నీటికోసం

మిగతా 2లో

# తిరుపతిలో జోరు వాన

పొంగి పొర్లిన డ్రైనేజీ కాలువలు

ఈదురు గాలులతో విరిగిపడ్డ ఫ్లెక్సీలు, వృక్షాలు


3 గంటలకు పైగా విద్యుత్ అంతరాయం

చల్లబడ్డ తిరుపతి నగరం

**తిరుపతి, మేజర్‌న్యూస్ ప్రతినిధి:**

వేసవి కాలం కావడంతో ఉష్ణోగ్రతలు ప్రతి రోజు 42 డిగ్రీల సెల్సియస్ నమోదు కావడంతో ఉక్కపోతతో తిరుపతి నగరవాసులు అల్లాడిపోయారు. ఈ నేపథ్యంలో ఆదివారం సుమారు మూడు గంటల పాటు ఏకధాటిగా తిరుపతిలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. ఈదురు గాలులు అధికం కావడంతో తిరుపతి నగరంలో మూడు గంటలకు పైగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో నగరంలోని ప్రజలంతా ఇళ్లల్లో నుండి బయటకు వచ్చి వర్షాన్ని ఆస్వాదిస్తూ కేరింతల కొడుతూ ఇళ్ళ ముందు ఆనందంగా గడిపారు. ఈదురు గాలులు ఎక్కువ కావడంతో పలుచోట్ల భారీ వృక్షాలు విరిగిపడ్డాయి, మరికొన్నిచోట్ల ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు విరిగిపోవడంతో పాటు రోడ్ల మీద పడ్డాయి. ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని చెప్పవచ్చు.

**గంగమ్మ తల్లి ఆశీస్సులతో వర్షం...** వేసవి కాలం కావడంతో అత్యధిక ఉష్ణోగ్రత నమోదు ప్రజలు అల్లాడిపోతున్న తరుణంలో ఒక్కసారిగా మూడు గంటలకు పైగా వర్షం పడటంతో నగరమంతా చల్లబడింది. తాతయ్యగుంట గంగమ్మ జాతర 6వతేదీ ప్రారంభం కానుండడంతో అమ్మవారి ఆశీస్సులతోనే వర్షంతో తిరుపతి నగరం అంతా చల్లబడిందని నగరవాసులు చెబుతున్నారు. ప్రతి ఏటా గంగమ్మ జాతరను పురస్కరించుకొని ఉత్సవాలు జరిగే ఆరు రోజులలో ఏదో ఒక రోజు వర్షం కురవడం ఆనవాయితిగా వస్తోంది. అయితే ఈసారి జాతర ప్రారంభానికి ఒకరోజు ముందే భారీ వర్షం కురవడంతో గంగమ్మ తల్లి ఆశీస్సులతోనే



మిగతా 8లో

## కీలపట్లలో శాశ్వత విద్యుత్ సమస్య పరిష్కారం

ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డి

5లో



## శ్రీదుర్గ మృతిపై పూర్తి విచారణ చేయిస్తాం

- శ్రీదుర్గ మరణం పార్టీకి తీరని లోటు
- శ్రీదుర్గ కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి కొల్లు రవీంద్ర
- శాసనసభ్యులు గురజాల జగన్మోహన్

**చిత్తూర్ బ్యూరో, మేజర్‌న్యూస్:**

గత మాసం రోడ్డు ప్రమాదంలో గాయపడి చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి అక్కడి అపోలో వైద్యుల నిర్లక్ష్య కారణంతో మృతి చెందిన రాష్ట్ర టిడిపి సీనియర్ నాయకులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్చార్జ్ షణ్ముగం కుమార్తె , తెలుగుదేశం చిత్తూరు పార్లమెంటు మహిళా విభాగ కార్యదర్శి శ్రీదుర్గ మృతిపై పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ముఖ్యమంత్రికి నివేదిస్తామని ఎక్సైజ్ శాఖమంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం చిత్తూరు పార్లమెంట్ మహిళా విభాగ కార్యదర్శి దివంగత శ్రీదుర్గ కార్యక్రమానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పార్టీ జిల్లా అధ్యక్షులు సిఆర్ రాజన్‌తో కలిసి హాజరాయ్యరు. మంత్రి కొల్లు రవీంద్ర, శాసనసభ్యులు గురజాల జగన్మోహన్

మిగతా 8లో





## డీసీసీబీ చైర్మన్‌కు టీడీపీ సీనియర్ నేతలు శుభాకాంక్షలు

**తిరుపతి, మేజర్ న్యూస్:** డీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన అమాస రాజశేఖర్ రెడ్డిని ఆదివారం వారి స్వగృహములో టిడిపి నగర మాజీ అధ్యక్షులు జె డబ్ల్యూ విజయ్ కుమార్, టిడిపి సీనియర్ కందాటి సురేష్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అమావాస రాజశేఖర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి ఫ్లవర్ బొకే ని అందించారు. వారితో పాటు డిసిసిబి చైర్మన్ ను కలిసిన వారిలో టిడిపి సత్యవతి చల్లా షణ్ముగం మల్లెపూల బాలు రామచంద్ర రెడ్డి లు ఉన్నారు.

## పిడుగు పాటుకి ఆవు, దూడ మృతి



**చిల్లకూరు మేజర్‌న్యూస్:** చిల్లకూరు మండలం, ఉడతవారి పాళ్యెం గ్రామ పంచాయతీ లోని వడ్డీకండ్రిగ గ్రామంలో ఆదివారం పిడుగు పడి ఆవుధూడ మృతి చెంది నది. ఆదివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో మొదలవడంతో, ఆరుబయట ఉన్న ఆవుదూడ పిడుగు పాటుకి గురై ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందినట్లు తెలిపారు.

## వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

**ఐదుగురిని అదుపులోకి తీసుకున్న తిరుచానూరు పోలీసులు**

**తిరుపతి, మేజర్‌న్యూస్:** ముళ్ళపూడి సమీపంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం. తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై అరుణ సిబ్బందిచే దాడిచేశారు. విజయవాడకు చెందిన ఓ మహిళ, జగ్గారెడ్డి గూడెంకు చెందిన మరో మహిళ కాగా తిరుపతికి చెందిన ముగ్గురు పురుషులను అదుపులోకి తీసుకు న్నారు. వ్యభిచార నిర్వహణ ఆర్గనైజర్ ఎవరు, ఎప్పటినుండి కొనసాగిస్తున్నారన్న కోణంలో కొనసాగుతున్న పోలీసుల విచారణ.

## అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం

**ప్రమాద ఘటనలోనే వ్యక్తి మృతి**



**తిరుపతి, మేజర్‌న్యూస్:** కడప జిల్లా బద్వేల్‌కు చెందిన వినోద్ కుమార్ (27)గా పోలీసులు గుర్తించారు. నారాయణపురంలో క్రేన్ సూపర్వైజర్‌గా విధులు నిర్వ హిస్తూ ఓటేరులో నివాసముండేవారన్నారు. గరుడవారధి ఫ్లైఓవర్ రామానుజమ్ సర్కిల్ వైపు నుండి మామిడి కాయల మండి వైపు వెళుతుండగా ప్రమాదం చోటుచేసు కున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని తిరుపతి మార్చురీకి తరలింపు. ప్రమాద ఘటనపై ఈస్ట్ ఎస్సై బాలకృష్ణ విచారణ చేపట్టారు.

## పిడుగుపాటుకు ఇద్దరు మృతి

**నాయుడు పేట, మేజర్‌న్యూస్:** నాయుడుపేట, ఓజిలి మండలాల్లో పిడుగుపాటుకు ఇద్దరు మృతి చెందారు. ఓజిలి మండలం గ్రద్దగుంట పంచాయతీ గొల్లపాలెం వద్ద మామిడితోటలో కార్తిక్ అనే బాలుడు, నాయుడుపేట మండలం ఒద్దిగుంట కండ్రిగ పంట పొలాల్లో పిడుగుపాటుకు అల్లం భాస్కర్ అనే రైతు మృతి చెందారు.

## గాలి వానలకు విరిగిన వృక్షాలు తక్షణ చర్యలు

**తిరుపతి బ్యూరో మేజర్‌న్యూస్:** ఆదివారం మధ్యాహ్నం సుమారు 12:30 గంటల ప్రాంతంలో తిరుపతి నగరంలో శ్రీ తాతయ్య గుంట గంగమ్మ దేవాలయమునకు పోవు రోడ్డు కాపువీధి లేబెట్‌లో, డిఆర్ మహల్, కర్నాల వీధి దొడ్డాపురం వీధి తదితర ప్రాంతాలలో వర్షాలు గాలికి భారీ వృక్షాలు రోడ్లపైన పడిపోయాయి. వెంటనే వాటిని తొలగించే కార్యక్రమం నగరపాలక సంస్థ కమిషనర్ వారి స్టాఫ్ విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి రోడ్లకు అడ్డంగా పడ్డ చెట్లను తొలగించడం, విద్యుత్ వైర్లు పోల్స్ డ్యామేజ్ జరిగిన వాటి అన్నిటిని కూడా పునరుద్ధించి విద్యుత్ సరఫరా చేశారు. ప్రజలకు ఇబ్బంది జరిగిన ఈ ప్రాంతాలలో ఆంధ్రప్రదేశ్ యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్ జి.నరసింహ యాదవ్, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్‌సిమునికృష్ణ తదితరులు పర్యటించి వెంటనే అధికారులు దృష్టికి తీసుకెళ్లి విద్యుత్ పునరుద్ధరణ, పడి ఉన్న చెట్లని అప్పటికప్పుడు తొలగించే కార్యక్రమాల్ని దగ్గరుండి పర్యవేక్షించారు. అదేవిధంగా డివిజన్ నెంబర్ 25లో కర్నాల వీధి రైల్వే గేటు పక్కన గల ఒక మహావృక్షం నేలకొరిగిన ప్రాంతాన్ని అక్కటి కార్పొరేటర్ నరసింహాచారి పర్య వేక్షణలో తొలగించాశారు. 12వ డివిజన్ కార్పొరేటర్ ఎస్కే బాబు డి.ఆర్ మహల్ వద్ద పడిపోయిన చెట్లను పరివేక్షించి వెంటనే కూడా తొలగించేశారు.

# భానుడి భగ..భగ..

(మొదటిపేజీ తరువాయి)

శీతలపానీయాల దుకాణాలకు పరుగులు తీయవలసిన పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఇక కొబ్బరి బొండాలకు డిమాండ్ బాగా పెరిగిపోతున్నాయి. ఒకపక్క ఆసుపత్రులలో చేరిన వారి కి, మరోపక్క దాహంతో అల్లాడిపోతున్న ప్రయాణీకులు రోడ్లపై కొబ్బరిబొండాల దుకాణాలు చూడగానే అక్కడకు పరుగులు తీస్తుండటంతో కొబ్బరిబొండం రూ.30ల నుంచి రూ.50ల వరకూ ధరలు పెరిగి





పోతున్నాయి. వడదెబ్బతో ఆసుపత్రులలో చేరినవారికి కొబ్బరి బొండాల బాటిల్ను రేట్లు కూడా పెంచేస్తున్నారు. తీవ్రమైన ఎండల కారణంగా గ్రామాలలో చెరువులు, బావులు మూగజీవాలకు తాగునీరు కరువైంది. పశువులు తాగు నీటి కోసం కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రోజు రోజుకు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవ్వడంతో అధిక ఉష్ణోగ్రత జిల్లాల జాబిత ఉండడం గమనార్హం. ఈ సంవత్సరం అగ్ని కార్తెలు మే 11వ తేదీ నుంచి రానున్నాయి. రోహిణీ కార్తె మే 25 నుంచి ప్రారంభం అవుతాయి ఈ సారి ఎండాకాలం సాధారణం కంటే ఎక్కువ ఎండల తీవ్రంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఎండ వేడిమి తీవ్రంగా ఉండ టంతో అగ్నికార్తెల్లో రోజంతా ఎండలు దారుణంగా ఉంటుందని అని ప్రజలు భయపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో తాగునీటికి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోతుండటంతో బోర్లలో నీరు రాకపోగా, చెరువులు, బావులు కూడా ఎండిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు.

# నాయుడుపేటలో మొదలైన పోలేరమ్మ జాతర

**గ్రామ దేవత పోలేరమ్మ జాతర ప్రారంభం**
**ఇంటింటికి వెళ్లి మడిబియ్యం సేకరణ**
**ఘటోత్సవాన్ని ప్రారంభించిన ఆలయ అధికారులు**



**నాయుడు పేట, మేజర్ న్యూస్:** ప్రతిఏట ఎంతో వేడుకగా నిర్వహించే ఉమ్మడి నెల్లూరుజిల్లా నాయుడుపేట గ్రామదేవత శ్రీ పోలేరమ్మ జాతర మహోత్సవ వేడుకలను ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. జాతర మహోత్సవం వేడుకలలో భాగంగా ఘటోత్సవంతో ప్రారంభమైయ్యాయి. ఈనెల 7న నిర్వహించ నున్న జాతర మహోత్సవంలో భాగంగా ముందుగా ఘటోత్సవం ప్రారంభించారు. ఘటం కుండలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఇంటింటికి వెళ్లి ఒడి బియ్యం ధాన్యాలను స్వీకరించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి రవికృష్ణ, విన్నమాల పెద్దకాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డి, జాతర కమిటీ చైర్మన్ ఆలయ నానబాల సుబ్బారావు, నాయకులు ఉయ్యాల ప్రవీణ్, అర్చకులు గణపతి, కమిటీ సభ్యులు నల్లబోతుల రామారావు, ధనుంజయ, ఆకుల కుబేరు మణి, చేపల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# 26 ఎర్రచందనం దుంగలు,వాహనం స్వాధీనం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఆదివారం ఉదయం 4-30 గంటలకు మామండూరు నార్త్ బీట్ నందు 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్(ఎఫ్ఆర్వో) సుదర్శన్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ..డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్,సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ లకు అందిన రహస్య సమాచారం మేరకు..తనతో పాటు, మామండూరు సెక్షన్ సిబ్బంది కలిసి మామండూరు నార్త్ బీట్ నందు వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో ఒక వాహనం (ఏపీ 36 ఏ ఎన్ 5073) ఆపకుండా వేగంగా తిరుపతి వైపు వెళ్ళింది.తక్షణం తాము అప్రమత్తమై ఆ వాహనాన్ని వెంబడించి అధిగమించగానే..ఆ వాహన డ్రైవర్ ఆంజనేయపురం సమీపంలో వాహనాన్ని అక్కడ నిలిపి పారిపోవడం జరిగిందన్నారు. నేరస్తులను పట్టుకోవడానికి తాము ప్రయత్నించగా వారు దొరకకుండా పారిపోవడం జరిగిందని అన్నారు. దొరికిన ఎర్రచందనం దుంగల బరువు 332 కిలోలు ఉన్నాయన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సుదర్శన్ రెడ్డి వివరించారు.ఈ కార్యక్రమంలో మామండూరు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ (సెక్షన్ అధికారి) ఎస్.గౌస్ కరీమ్, ఎఫ్‌బిఓలు ఏపి.శరవణ కుమార్, బి.జాన్ శామ్యూల్, అలాగే బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.



## షాట్ సర్క్యూట్‌తో కాలిపోయిన పూరిల్లు

**చిల్లకూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని బల్లవోలు గ్రామంలో పి.నాగభూషణం యొక్క ఇల్లు కరెంటు షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమై పోయింది. ఆదివారం జరిగిన సంఘటనలో ఇంటిలోని గృహోపకరణాలు, వివిధ సర్టిఫికెట్లు, బంగారు, నగదు మొదలైనవి కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అర్పివేశారు. సుమారుగా రూ.5లక్షల



వరకు ఆస్థి నష్టం వాటిల్లిందని వాపోయారు. బల్లవోలు గ్రామ వీఆర్వో గిరీష్ సంఘటన స్థలాని పరిశీలించి, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్థానిక నాయకుల నుంచి సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు.



## ద్రౌపది దేవి సేవలో రాజేష్

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మండలంలోని చవట గుంట మహాభారతం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సత్యవేడు నియోజకవర్గ వైసిపిసమన్వయకర్త నూకతోటి రాజేష్ ద్రౌపది దేవి సేవలో పాల్గొని తరించారు. అమ్మ వారికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహకులు రాజేష్‌ను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

## కుంభాభిషేకంలో విజయనందరెడ్డి

**గుడిపాల, మేజర్‌న్యూస్:** మండలంలోని పిల్లారికుప్పం గ్రామంలోని ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో ఆదివారం జరిగిన మహా కుంభాభిషేక వేడుకల్లో చిత్తూరు వైసీపీ సమన్వయకర్త విజయానంద రెడ్డి పాల్గొన్నారు. మండలం, స్థానిక నాయకులు స్థానిక సర్పంచులు రజనీ కాంత్, చిట్టిబాబు, స్వాగతం పలికారు. సంప్రదాయ దుస్తులతో ఆలయంలోకి ప్రవేశించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరంఆలయ కుంభాభిషేకం,



హెూమాది కార్యక్రమాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు రాసనపల్లి ప్రకాష్, వసంతాపురం సర్పంచ్ రజనీకాంత్, పాప సముద్రం సర్పంచ్ చిట్టిబాబు, గడ్డం విజయ, వైసిపి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నాయుడుపేట బీభత్సం సృష్టించిన వాన

**ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షం**

**నాయుడు పేట, మేజర్‌న్యూస్:** నాయుడు పేట పట్టణంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా



భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు కూడిన భారీ వర్షం కారణంగా పట్టణంలోని రహదారులన్నీ జలమైయ్యాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోతకు ఇబ్బందులు పడ్డ పట్టణ ప్రజలు వర్షం కారణంగా కొంత ఉపశమనం పొందారు. ఈ వర్షం కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. రోడ్లపై వర్షపునీరు భారీగా చేరడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

## పిడుగుపాటుకు ఇద్దరు మృతి

**ఓజిలి, మేజర్‌న్యూస్:** నాయుడు పేట, ఓజిలి మండలాల్లో ఆదివారం పిడుగుపాటుకు ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. ఓజిలి మండలం గ్రద్దగుంట పంచాయతీ గొల్లపాలెం వద్ద మామిడితోటలో పిడుగు పడడంతో నాయుడు పేట పట్టణంలోని 7వ తరగతి చదువు తున్న విద్యార్థి కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే నాయుడు పేట మండలం వద్ది గుంట కండ్రిగ పంట పొలాల్లో వ్యవసాయ పనులు



చేసుకుంటున్న రైతు ఆలం భాస్కర్‌పై పిడుగు పడడంతో అతను మృతి చెందాడు.



## రైలు ఢీకొని వృద్ధుడు మృతి

**దొరవారిసత్రం, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని పోలిరెడ్డి పాలెం గ్రామ సమీపాన ఉన్న రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం రైల్వే ట్రాక్ పట్టాలు దాటుతున్న వృద్ధుడు బట్టా చంద్రయ్య(65)ను రైలు ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందాడు. జీఆర్పి పోలీసులు కథనం మేరకు, మావిళ్ళపాడు గ్రామానికి చెందిన చంద్రయ్య, పొలం పనులు చూసుకునేందుకు రైలు పట్టాలను దాటుతూ ఉన్న సమయంలో చెన్నై వైపు నుండి నెల్లూరు వైపు వెళ్లే రైలు ఢీకొన్నది, దీంతో చంద్రయ్య తీవ్ర గాయాలకు గురై అక్కడకక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న సూళ్లూరుపేట జీఆర్పి పోలీసులు ప్రమాదం జరిగిన సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన సంఘటనను పరిశీలించి, అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసును జీఆర్పి ఎస్సై చెన్నకేశవ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టుగా తెలిపారు.

## ఆలయ కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే గురజాల

**గుడిపాల, మేజర్‌న్యూస్:** గుడిపాల మండలంలోని పిల్లారికుప్పం గ్రామంలోని ఇటీవల వెలసిన ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో ఆదివారం జరిగిన మహా కుంభాభిషేక వేడుకల్లో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొన్నారు. మండలం, స్థానిక నాయకులు ఎమ్మెల్యేకి ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే





కుంభాభిషేకం, హెూమాది కార్యక్రమాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మండల ఉపాధ్యక్షులు అనిల్ కుమార్ చౌదరి, మాజీ జడ్పీ చైర్మన బాలాజీనాయుడు సర్పంచ్ రవినాయుడు, హేమాద్రినాయుడు, బాలసుబ్రహ్మణ్యం, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక వాయిదా

**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం కడా ఆధ్వర్యంలో సోమవారం జరుగవలసిన ప్రజా సమస్యల పరిస్కార వేదిక కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్టు కడా పీడి వికాస్ మరమ్మాత్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉంది. ఇందులో భాగంగా కుప్పం కడా వారు ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించడం జరుగుతోంది. అయితే కొన్ని అనివార్య కారణాలవల్ల ఈనెల 5వ తేదీ జరగవలసిన కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్టు తెలిపారు. ఇందుకు నియోజకవర్గ ప్రజలు సహకరించాలని కడా పీడి కోరారు.





## మామిడి తోటకు నిప్పు

**ఎస్ఆర్.పురం, మేజర్‌న్యూస్:** గుర్తు తెలియని వ్యక్తులు మామిడి తోటకు నిప్పు పెట్టిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఆర్ పురం మండలం పుల్లూరు గ్రామానికి చెందిన, రైతు భాస్కర్ నాయుడుకి ఎగువ కమ్మ కండ్రిగ రెవెన్యూ శాఖలో సర్వేనెంబర్ 161/ఎ నాలుగు ఎకరాల మామిడి తోట ఉంది ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు తోటకు నిప్పు పెట్టడంతో 250 మామిడి చెట్లుతో పాటు డ్రిప్ పైపులు, మామిడికాయలు కాలిపోయింది. సుమారు లక్ష రూపాయలు వరకు నష్టం వాటిల్లిందని రైతు భాస్కర్ నాయుడు వాపోయారు. ప్రభుత్వ స్పందించి తనను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేసినారు.

## ఘనంగా ఉచిత ఖత్నా

**శ్రీకాళహస్తి అర్బన్, మేజర్‌న్యూస్:**

శ్రీకాళహస్తి హజరత్ మహబూబ్ సుభాని రహానిషాన్ ముత్త వల్లి షేక్ మిర్జాన్ సాహెబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఒడుగులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒడుగులు కార్యక్రమాన్ని డాక్టర్ అహమ్మద్ భాష వెంకటగిరి వాళ్లు వచ్చి పిల్లలకు ఒడుగులు చేశారు. ఈదులగుంట షాదీ మహల్లో ముస్లిం పిల్లలకు ఒడుగులు చేసిన పిల్లలకు పండ్లు బ్రెడ్ మందులు సరఫరా చేశారు. ఈ కార్యక్రమం గత 26 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నా మని ముతవల్లి షేక్ మీర్జాన్ సాహెబ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్త్ యాంటీ కరప్షన్ ప్రెసిడెంట్ లాలూ ఇస్మాయిల్, సెక్రెటరీ ఆరిఫ్, ఎక్త్ యాంటీ కరప్షన్ మీడియా ప్రెసిడెంట్ యాసిన్, ఖాదర్ భాషా, ముజీబ్ సాదిక్ కాలేషా, సలీం తదితరులు పాల్గొన్నారు.



## నాగేశ్వర యాదవ్‌కు ఘన సత్కారం

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ సాధికార కమిటీ అధ్యక్షులు, కర్నూలు డిసిఎంసి చైర్మన్ నాగేశ్వర యాదవ్‌ను చిత్తూరు జిల్లా టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ ఘనంగా సత్కరించారు. ఆదివారం చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ సాధికార కమిటీ అధ్యక్షులు నాగేశ్వర యాదవ్‌ను జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా స్వాగతించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, చిత్తూరు జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ శాలువ కప్పి గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, గుర్రప్ప యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.



# తిరుమల కల్యాణవేదికకు నూతన వధూవరుల నుండి విశేష స్పందన

**తిరుమల, మేజర్ న్యూస్:** టిటిడి నిర్వహిస్తున్న ఉచిత వివాహాలకు నూతన వధూవరుల నుండి విశేష స్పందన లభిస్తుంది. టిటిటి 2016 ఏప్రిల్ 25వ తేదీ నుండి తిరుమల పాపావినాశనం రోడ్డులోని కళ్యాణ వేదిక వద్ద ఉచితంగా వివాహాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. తిరుమలలోని కల్యాణ వేదికలో 2016 ఏప్రిల్ 25 నుండి 2025 మే 1వ తేదీ వరకు 26,214 వివాహాలు అయ్యాయి. ఇందులో భాగంగా పురోహితుడు, మంగళవాయిద్యంతోపాటు పెళ్లి సమయంలో పసుపు, కుంకుమ, కంకణంను టిటిడి ఉచితంగా అందిస్తుంది. వివాహానికి కావాల్సిన ఇతర సామాగ్రిని మాత్రం వధూవరులే తీసుకురావాల్సి ఉంటుంది. వివాహానికి వధూవరుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. పెళ్లికి రాలేని పక్షంలో అందుకు సంబంధించిన ఆధార పత్రాలను సమర్పించాలి. వివాహం అనంతరం రూ.300/–ల ప్రత్యేక ప్రవేశం ద్వారా పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తెతోపాటు ఇరువురి తల్లిదండ్రులను కలుపుకుని మొత్తం 6 మందికి ఏటీసీ వద్ద గల క్యూలైన్ మార్గం ద్వారా ఉచితంగా శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు. దర్శనానంతరం ఉచితంగా 6 మంది 6 లడ్డూలను లడ్డూ కౌంటర్లు నందు పొందాలి.

**కల్యాణ వేదికకు ఆన్లైన్లోనే బుకింగ్ అవకాశం...**

తిరుమలలోని కళ్యాణ వేదికలో ఉచిత వివాహలు చేసుకునేందుకు ఆన్లైన్లో కల్యాణవేదిక స్లాట్ను బుక్ చేసుకునే సదుపాయాన్ని 2016 మే 9వ తేదీ నుండి నూతన వధూవరులకు టిటిడి కల్పించింది. ఇందుకోసం తమ సమీపప్రాంతాల్లోని నెట్ సెంటర్ లో టిటిడి వెబ్సైట్ను సంప్రదించాల్సి ఉంటుంది. అక్కడ ఉన్న కల్యాణవేదిక కాలమ్లో అబ్బాయి, అమ్మాయి వివరాలను నమోదుచేయాలి. వధూవరులు తప్పనిసరిగా తల్లిదండ్రుల వివరాలను నమోదు చేయడమేకాక ఆధార్ కార్డులను అప్లోడ్ చేయాలి. వయసు ధృవీకరణ కోసం బర్త్ సర్టిఫికేట్ లేదా పదో తరగతి మార్క్సిస్ట్ / ట్రాన్స్ఫర్ సర్టిఫికేట్ లేదా పంచాయతీ కార్యదర్శి/ మునిసిపల్ అధికారుల నుండి బర్త్ సర్టిఫికేట్ ను జత చేయాల్సి ఉంటుంది. వీటితోపాటు అందులో వివాహ తేది, సమయాన్ని వారే నిర్ణయించుకుని అప్లోడ్ చేస్తే అక్నాలెడ్జ్మెంట్ పత్రం జారీ అవుతుంది. కొత్తగా పెళ్లి చేసుకునే వారు అక్నాలెడ్జ్మెంట్ పత్రాన్ని తీసుకుని కేవలం 6 గంటల ముందు తిరుమల చేరుకుని కల్యాణ వేదిక వద్ద ఉన్న కార్యాలయంలో వారి వివరాలను మరోసారి అక్కడి సిబ్బంది ద్వారా పరిశీలించుకోవాలి. కరెంటు బుకింగ్ / ఆన్లైన్లో బుక్ చేసుకునే జంటలు తిరుమలలో ఉచితంగా వివాహం చేసుకొనుటకు తప్పనిసరిగా హిందూ మతస్థులై ఉండాలి. వధువుకు 18 సంవత్సరాలు, వరునికి 21 సంవత్సరాలు నిండివుండాలి. ద్వితీయ వివాహములు మరియు ప్రేమ వివాహములు ఇక్కడ జరుపబడవు. ఇతర వివరాలకు ఫోన్ – 0877 – 2263433 సంప్రదించవచ్చు.

**వివాహ రిజిస్ట్రేషన్కు....**

తిరుమలలో వివాహం చేసుకున్న నూతన వధూవరులు, తమ వివాహన్ని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "హిందూ వివాహ సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయము"ను కల్యాణవేదిక వద్ద ఏర్పాటు చేసింది. ఇందుకోసం నూతన వధూవరులు తమ వయస్సు ధృవ పత్రములు, నివాస ధృవ పత్రము, వివాహము ఫోటో, పెండ్లి పత్రిక, కళ్యాణ మండపము రసీదు పత్రాలను, వీటితో పాటు అవివాహితులుగా (అన్ మ్యారీడ్) ఉన్నట్లు స్థానిక ఎమ్మార్వో నుండి ధృవీకరణ పత్రాలను కల్యాణ వేదిక వద్ద అధికారులకు సమర్పించాలి. ఇతర వివరాలకు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు కార్యాలయంలో నేరుగా లేదా ఫోన్ – 0877 – 2263433 సంప్రదించవచ్చు. తిరుమలలో వివాహం చేసుకునే దంపతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టిటిడి కోరుతోంది.





# తెదేపా మహిళా నాయకురాలికి ఘన నివాళి

**చిత్తూరు అర్బన్, మేజర్న్యూస్:** ఇటీవల మృతి చెందిన తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంటరీ మహిళా కార్యదర్శి డి.శ్రీదుర్గ చిత్రపటానికి రాష్ట్ర ఎక్సైజ్, భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు సీఆర్ రాజన్.. ఇతర తెదేపా నాయకులు నివాళులు అర్పించారు. ఆదివారం నగరం లోని సంతపేటలో జరిగిన ఉత్తర కర్మక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జనసేనలో చేరిన 20మంది యువకులు

**కుప్పం, మేజర్ న్యూస్:** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలను నాయకత్వాన్ని ఆకర్షితులై కుప్పం నియోజకవర్గం కుప్పం మండలం అడివిబూదుగురు పంచాయతీకి చెందిన 20 మంది యువకులు జనసేన పార్టీలో చేరినట్లు కుప్పం జనసేన ఇంచార్జి నరేష్ తెలిపారు. వారిని జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలోకి కుప్పం జనసేన ఇన్చార్జి నరేష్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్థానిక ఎన్నికలు రానున్నడంతో కూటమి నాయకులకు మద్దతుగా పని చెయ్యాలని సూచిస్తూ జనసేన పార్టీని మరింత బలోపేతం చెయ్యడానికి ప్రతీ జనసైనికుడు కృషి చేయాలని అలాగే కూటమి ప్రభుత్వం కుప్పం ఎమ్మెల్యే నారా చంద్రబాబు నాయుడు నాయక త్వం ద్వారా జరుగుతున్న అభివృద్ధి సంక్షేమాలు ప్రజలు వద్దకు తీసుకెళ్లాలని ఎన్డీయే ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు ప్రతి గ్రామంలోనూ తెలియచెయ్యాలని నరేష్ తెలిపారు.




# ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.1.50 కోట్ల విరాళం

**తిరుమల, మేజర్న్యూస్:** బెంగుళూరుకు చెందిన సుయుగ్ వెంచర్స్ ఎల్ఎల్పీ సంస్థ చైర్మన్ యతీష్ సూరినేని ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు ఆదివారం రూ.1.50 కోట్లు విరాళంగా అందించారు. ఈ మేరకు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్. నాయుడుకు విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దాతను చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామ కృష్ణ పాల్గొన్నారు.



# గంగను భువికి తెచ్చిన ఘనుడు భగీరథుడు

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్న్యూస్:** గంగను భువికి తెచ్చిన మహనీయుడు భగీరథ మహర్షిని జిల్లా కలెక్టరేట్ ఏ ఓ కులశేఖర్ పేర్కొన్నారు. భగీరథ మహా మహర్షి జయంతి సందర్భంగా ఆదివారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ నందు జిల్లా వెనుకబడి న తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహా మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏ ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు భగీరథ మహా మహర్షి జయంతి ఉత్సవం నిర్వహించామన్నారు. గంగను భువికి తెచ్చిన మహనీయుడు భగీరథ మహర్షిని ఈ సందర్భంగా భగీరథ మహర్షిని స్మరించడం, పూజించడం మనందరి కర్తవ్యమని తెలిపారుఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇంచార్జి డి డి కె.మునీంద్రయ్య, సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి నాగేశ్వరరావు బి సి సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టరేట్లో ఘనంగా భగీరథ మహర్షి జయంతి

**– లక్ష్య సాధనకు మహర్షి భగీరథుడిని స్ఫూర్తిగా తీసుకోవాలి**

**– జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు**

~~**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్:** లక్ష్య నిర్దేశంతో సాధన దిశగా చేసే~~ ఏ ప్రయత్నంలోనైనా విజయాన్ని సాధించవచ్చని దివి నుండి భువికి గంగను తెచ్చిన భగీరథ మహర్షి పట్టుదల అసామాన్యమని స్ఫూర్తిదాయకం అని జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ జయంతి వేడుకల్లో డిఆర్ఓ ముఖ్య అతిథిగా హాజరై మహర్షి భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు భగీరథ మహర్షి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ గంగను దివి నుంచి భువికి ఎంతో పట్టుదలతో తెచ్చిన మహనీయుడు భగీరథ మహర్షి అని అందుకే ఆయన అపర భగీరథుడు అని అన్నారు. ఆ మహనీయుడిని స్మరించుకోవడం, జయంతి వేడుకలు జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. మహనీయుల గొప్పతనాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మహనీయుల జీవిత విశేషాలను ప్రజలకు తెలియజేయాలన్న సత్సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం భగీరథ మహా మహర్షి వేడుకలను రాష్ట్ర వేడుకగా నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. లక్ష్య నిర్దేశంతో సాధన దిశగా చేసే ఏ ప్రయత్నంలోనైనా విజయాన్ని సాధించవచ్చని దివి నుండి భువికి గంగను తెచ్చిన భగీరథ మహర్షి పట్టుదల అసామాన్యమని స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోత్స్న, లక్ష్మీ నారాయణ, కలెక్టరేట్ సిబ్బంది, బి సి సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# గుంపు కలహాల వల్లే ఏనుగు మృతి

**– డీఎఫ్ఓ భరణి స్పష్టం**

**చిత్తూరు అర్బన్, మేజర్న్యూస్:** గుంపు కలహాల వల్లే గున్న ఏనుగు మృతి చెందిందని జిల్లా అటవీ శాఖ అధికారి భరణి స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని స్థానిక అటవీ శాఖ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎఫ్ఓ భరణి మీడియాతో మాట్లాడుతూ బంగారుపాళ్యం మండలం పరిధిలోని మొగిలి గాని చెరువు వద్ద మృతి చెందిన గున్న ఏనుగు నాటు బాంబు పేలి చనిపోలేదని, ఏనుగుల గుంపులో ఉన్న గున్న ఏనుగుపై తోటీ ఏనుగులు దాడికి పాల్పడగా గాయపడి అస్వస్థతకు గురై మృతి చెందిందని తెలిపారు.



# కీలపట్లలో శాశ్వత విద్యుత్ సమస్య పరిష్కారం

**- రూ. 60 లక్షలతో ఏర్పాటు చేసిన 100 కేవి ట్రాన్స్ ఫార్మర్ లను ప్రారంభించిన ఎమ్మెల్యే అమర్**

**పలమనేరు, మేజర్‌న్యూస్:** గంగవరం మండలంలోని కీలపట్ల పంచాయతీ పరిధిలో విద్యుత్ సమస్య శాశ్వతంగా పరిష్కారానికి నోచుకుందని ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. కీలపట్లలోని కోనేటి రాయస్వామి ఆలయంలో స్వామి వారిని ఆదివారం ఆయన దర్శించుకుని పంచాయతీ కేంద్రంలో రూ. 60 లక్షల ఆర్డీఎస్ నిధుల ద్వారా ఏర్పాటు చేసిన నాలుగు 100 కేవి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుల తో పాటు విద్యుత్ శాఖ అధికారులు ఆయనకు ఘన స్వాగతం తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన కీలపట్ల గ్రామంలో స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపట్టే ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో విద్యుత్ తీగల కారణంగా ఇబ్బందులు ఉండేవన్నారు. గ్రామస్తులు, భక్తుల శ్రేయస్సు దృష్ట్యా 60 లక్షలతో గ్రామంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుతోపాటు 100కేవి ట్రాన్స్ఫార్మర్లను, సమస్య అనేదే ఉత్పన్నం కాకుండా ఉండేందుకు అదనంగా 25 కేవి అడిషనల్ ట్రాన్స్ఫార్మర్ను సైతం ఏర్పాటు చేశామన్నారు. దీంతో అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండడమే కాకుండా లో ఓల్టేజి సమస్య అనే మాటే ఉండదన్నారు. ఈ ప్రాంతంలోని ప్రజల అవసరాలకే గాక 24 గంటలు త్రీఫేస్ విద్యుత్ ను వాడుకోనేందుకు వీలుందన్నారు. దాంతో పాటు పంచాయతీ పరిధిలో చిన్న పరిశ్రమలను సైతం ఏర్పాటు చేసుకోవచ్చని వివరించారు. అతి తక్కువ సమయంలో ఆర్డీఎస్ కాంట్రాక్టర్లు, విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ఈ పనులను పూర్తి చేయడం అభినందించదగ్గ విషయం అన్నారు. కీలపట్ల పంచాయతీ పరిధిలో ఆలయాన్ని టిటిడి పరిధిలోకి తీసుకోవడం, రోడ్లు,గృహాలు, విద్యుత్, తాగునీరు, పాఠశాలలు అన్ని అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే జరిగాయన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ట్రాన్స్ కో ఈ.ఈ శ్రీనివాస మూర్తి, ఏడిఈ చిన్నబ్బ, కన్స్ట్రక్షన్ ఏ.డి రెడ్డి కుమార్, ఏ.ఈ రామక్రిష్ణ, టీడీపీ నాయకులు సోమశేఖర్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ చంద్ర శేఖర్, వేణు, గిరిధర్ గోపాల్, రాము,శీనప్ప, శ్రీనివాసులు, జనసేన నాయకులు చంద్ర తదితరులు పాల్గొన్నారు.






## ప్రజా సమస్యలు పరిష్కారమే మా ధ్యేయం

**: ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి ఊరందూరులో గ్రామంలో ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రజలు నుంచి వినతులు స్వీకరించి సమస్యలు పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అర్జీలు సకాలంలో పూర్తి చేసి అర్జీదారులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

**- కమిషనర్ ఎన్.మౌర్య**

**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో సోమవారం నుండి ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులో తప్పులు సరిదిద్దుకోవడం కోసం మరియు కొత్త ఆధార్ నమోదు 5 నుండి 8వ తేదీ వరకు, అలాగే 12 నుండి 15 వ తేదీ వరకు 12 సచివాలయాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. దొడ్డాపురం వీధి-01, ఐ.ఎస్ మహల్ రోడ్-02, జర్నలిస్ట్‌కాలనీ-01, కెనడీ నగర్-01, మధురానగర్-1,2, పోస్టల్ కాలనీ-04, ప్రకాశంరోడ్-02, రాజీవ్ నగర్ జీవకోన-06, శంకర్ కాలనీ -01, రేణిగుంట రోడ్-1, రాజీవ్ నగర్ జీవకోన-03, చెన్నారెడ్డి కాలనీ -03 నందు ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఆ ప్రకటనలో కోరారు.



## భారత నాటకంలో అలరించిన దుర్యోధన వధ పాత్ర

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మండలంలోని చవటకుంట మహాభారతం యజ్ఞ కార్యక్రమంలో భాగంగా చివరి రోజైన ఆదివారం దుర్యోధన వద కార్యక్రమం పలువురిని అలరింపజేసింది. గంగమడుగులో దాగి ఉన్న దుర్యోధనుని భీముని వేషదారుడు లాక్కుని వస్తున్న ఘటన ను పలువురు తిలకించారు. దుర్యోధనుని బొమ్మ వద్దకు తీసుకుని వచ్చి దుర్యోధనుడు, భీముడు వేషధారులు పద్యాలు, పాటలు ఆలపించారు. చివరకు దుర్యోధనుడు, భీముడు తలపడుతూ దుర్యోధనుని వధించిన సంఘటన పలువురిని అలరింపజేసింది. దుర్యోధనుని వదానంతరం దుర్యోధనుని మట్టి ప్రతిమను భక్తులు తీసుకొని వెళ్ళి తమ ఇళ్లల్లో నిలువ చేశారు. దుర్యోధనుని మట్టితో అష్ట ఐశ్వర్యాలు సిద్ధిస్తాయన్న భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆదివారం సాయంత్రం ద్రౌపది దేవి అమ్మవారు అగ్నిగుండ ప్రవేశం చేయడంతో భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి తమ భక్తిని చాటుకున్నారు. అగ్నిగుండ ప్రవేశం అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



## చలివేంద్రాలకు దాతలు స్పందించండి

**కే వి బి పురం మేజర్‌న్యూస్ :** కేవీ బి పురంలో, మండలంలోని పలు ప్రాంతాల్లో దాతలు ఎవరైనా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు స్థానికులు మరియు మండల ప్రజలు కోరుతున్నారు. త్రీవ్ర ఎండ దృష్ట్యా డిహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటుందని మండల ప్రజలు కోరారు. నిత్యం మండల కేంద్రానికి పలు రకాల సమస్యలపై కార్యాలయాలకు వస్తుంటారని వేసవి దృష్ట్యా తాగునీటికి ఇబ్బందికరంగా ఉంటుందని, అలాగే కూడలి ప్రాంతంలో అధికారులు స్పందించి దాతల ద్వారా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు తెలిపారు. దీనిపైన ఎంపీడీవో, ఎమ్మార్వోలు స్పందించి బస్టాండ్, జన సమూహాల కూడలి, రద్దీ ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానిక ప్రజలు, మండంలోని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ప్రావీణ్యులు కావాలని అనుకుంటున్నారా

**-"మేక్ మై బేబీ జీనియస్"క్యాంపస్‌కు వెళ్లండి**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** చదువుకుంటున్న విద్యార్థుల నుండి, పెద్దవాళ్ల వరకు.. తెలుగు,ఇంగ్లీష్,హిందీ భాషలను తప్పులు లేకుండా అర్థవంతంగా చదవడం,రాయడం నేర్చుకోవాలంటే.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉపయోగిస్తున్న ఏకైక విద్యాసంస్థ "మేక్ మై బేబీ జీనియస్"క్యాంపస్ కు వెళ్ళండి.ఈ క్యాంపస్ స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డు,పోలీస్ పరేడ్ గ్రౌండ్ సమీపంలో ఉంటుంది.వీళ్లకు చదువు రాదు,వీళ్లు చదువుకు పనికిరారు,వీళ్లకు చదువు చెప్పలేము అని ముద్రపడ్డ విద్యార్థులను సైతం చదువులో "భళ"అనేలా..నేటి విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్న ఏకైక విద్యాసంస్థ "మేక్ మై బేబీ జీనియస్". ఈ విద్యాసంస్థలో వేసవి శిక్షణ తరగతులు ఆన్లైన్ మరియు ఆఫ్ లైన్ లలో అడ్మిషన్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.ఈనెల 5వ తేదీ లోపు అడ్మిషన్ తీసుకున్న వారికి కోర్సు ఫీజులు 20 శాతం ప్రత్యేక తగ్గింపు ఉంటుంది.మరిన్ని వివరాలకు 88868000 91/8886800093 నెంబర్లను సంప్రదించండి.

అత్యంత సులభంగా, వేగంగా, ఖచ్చితంగా, అర్థవంతంగా, శాస్త్రీయంగా 2వ తరగతి విద్యార్థులంతో సైతం 10వ తరగతి బుక్స్ చదవడానికి ఉపయోగపడే పద్ధతిని రూపకల్పన చేసిన చదువుల డాక్టర్ సంగంరాజు భాస్కర్‌రాజు



21 భాషలను కుడి, ఎడమ చేతులతో 6విధాలుగా (సాధారణంగా, తలకిందులుగా, మిర్రర్ రైటింగ్) రాయడం ద్వారా 13 ప్రపంచ రికార్డులు సాధించి ప్రసిద్ధి చెందిన కుమారి సంగరాజు అశ్విని



# గంగమ్మ గుడిలో ప్రత్యేక అభిషేకాలు

**పలమనేరు, మేజర్ న్యూస్:** ఏప్రిల్ 30వ తేదీ నుండి గంగ చాటు ప్రారంభించినప్పటి నుండి పట్టణంలో ఒక్క కులస్తులు ఒక్కరోజు మారెమ్మ తల్లికి గంగమ్మ తల్లికి వారి సంఘాల తరపున బ్యాండ్ వాయిద్యాలతో మేళ తాళాలతో ఊరేగింపుగా వచ్చి మారెమ్మ తల్లికి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆదివారం పలమనేరు బలిజ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో మొదట వేణుగోపాల స్వామి గుడిలో బాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. అనంతరం పురవీధుల గుండా బ్యాండ్ వాయిద్యాలతో వివిధ వేషధారణలతో ఏర్పాటుచేసిన వారు నాట్యాలు ప్రదర్శిస్తూ అందరిని ఆకట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో వేణుగోపాల స్వామి గుడి నుండి గంగమ్మ గుడి మారెమ్మ గుడి దేవాలయాలలో బలిజ కులస్తులు అందరూ ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించి అన్నదానం ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా గంగమ్మ గుడి చైర్మన్ శ్రీధర్ మాట్లాడుతూ... ఆదివారం బలిజ కులస్తులు అందరూ కలసి గంగమ్మ తల్లికి పూజలు చేయడం జరిగిందన్నారు. అనంతరం డాక్టర్ ఆకుల గజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ... ఆ గంగమ్మ తల్లి దీవెనలు ప్రజలందరిపై ఉండాలని కోరారు. అనంతరం బాస్ అధ్యక్షులు రూపేష్ మాట్లాడుతూ.... ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా బలిజ అభ్యుదయ సేవా సంఘం తరపున పూజలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం జనసేన పార్టీ నాయకుడు జిల్లేడు అరుణ్ కుమార్ మాట్లాడుతూ... ఈ సంవత్సరం అత్యంత వైభవంగా గంగ జాతరను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వలన ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగిందన్నారు. భక్తిశ్రద్ధలతో గంగమ్మ తల్లికి బలిజ కులస్తులందరూ మొక్కులు చెల్లించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు బలిజ అభ్యుదయ సేవా సంఘం సభ్యులు అందరూ పాల్గొన్నారు.



## పోలీస్ క్యాంటిన్‌లో సేల్స్ బాయ్స్, గర్ల్స్ ఇంటర్వ్యూ

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** పోలీస్ క్యాంటిన్ నందు పనిచేయుటకు గాను దరఖాస్తులు చేసుకున్న యువతీ యువకులకు చిత్తూరు పట్టణము లోని పోలీస్ ఆఫీస్ నందు ఉన్న కేంద్రీయ సెంట్రల్ పోలీస్ క్యాంటిన్ నందు సేల్స్ బాయ్స్ సేల్స్ గర్ల్స్ గా పనిచేయుటకు గాను దరఖాస్తులు చేసుకున్న ఉత్సాహవంతులైన యువతీ యువకులకు ఈ నెల ఆరవ తేదీన మంగళవారం ఉదయం 9.30 నుండి సాయంత్రం 05.00 వరకు ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు ఆదేశాల మేరకు ఆర్.ఐ భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున దరఖాస్తులు చేసుకున్న యువతీ యువకులు 1వ పట్టణ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్నటువంటి జిల్లా పోలీస్ కార్యాలయములోని మోటార్ ట్రాన్స్పోర్ట్ ఆఫీస్ నందు ఇంటర్వ్యూల కొరకు హాజరు కావాలనని తెలిపారు. ఇతర సమాచారంకు ఆర్ ఐ 9491074516 ను సంప్రదించగలరు.

## శివయ్య సేవలో నిమ్మకాయల చిన రాజప్ప



**శ్రీకాళహస్తి అర్బన్, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దర్శనం కొరకు ఆంధ్ర ప్రదేశ్ మాజీ మంత్రి. తెలుగుదేశం పార్టీ నేత నిమ్మకాయల చిన్న రాజప్ప విచ్చేశారు. వారికి శ్రీకాళహస్తి పట్టణం తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రకాష్ నాయుడు. పోన్నా రావు తదితరులు పాల్గొన్నారు.

## రేణిగుంటలో ట్రాఫిక్ నియంత్రణ

**రేణిగుంట, మేజర్‌న్యూస్:** రేణిగుంట పట్టణ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ కార్యక్రమం చేపట్టిన రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర. ఆదివారం సాయంత్రం సిబ్బందితో కలిసి ట్రాఫిక్ క్రమ బద్ధీకరణలో భాగంగా రేణిగుంట పట్టణంలోని బస్టాండు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో రోడ్డు పైన ఉన్న వ్యాపారస్తులకు



ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పిస్తూ చిరు వ్యాపారస్తుల బండ్లు ,వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కృష్ణాపురం జన్మదిన వేడుకలు



**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** మండలంలో కృష్ణాపురం పంచాయతీ చెందిన మాజీ ఎంపీపీ మాదిరాజు జనార్దన్ రాజు కుమారుడు మాదిరాజు మురళీకృష్ణ రాజు ఎం.కె ఇన్స్టక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన జన్మదిన వేడుకలలో ,ప్రభుత్వ విప్, గంగాధర్ నెల్లూరు శాసనసభ్యులు డాక్టర్ వి.ఎం థామస్ అనంతరం ధర్మరాజు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం పలు సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారి అభిమానులు పాల్గొన్నారు.

## కావమ్మ-మారయ్య ఆలయం వద్ద అగ్నిగుండ ప్రవేశం

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** చంద్రగిరి గ్రామపంచాయతీ పరిధిలోని పాతపేట కావమ్మ గుడివీధిలో వెలిసి ఉన్న శ్రీ కావమ్మ-మారయ్య ఉత్సవాలలో భాగంగా ఆదివారం 3వరోజు ఉదయం 10 గం" లకు ఆలయంలో అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం గావించి, పట్టు వస్త్రములు కట్టి,సువాసనను గొలిపేపుష్పాలతో అలంకరించి, ధూప, దీప, నైవేద్య, కర్పూర హారతులు ఇచ్చి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షురాలు పసుపులేటి సరస్వతి రమణ,కోశాధికారి రంగు ధనలక్ష్మిరాజేంద్ర, కార్యనిర్వాహకులు రంగు కీర్తి, తులసి పద్మశ్రీ రఘురామన్, ఉదయశ్రీ హేమంత్, నాగమ్మ పుల్లయ్య,రంగు మహేష్, జి .వసంతకుమారిపాల్గొన్నారు. సాయంత్రం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశం లో పాల్గొను వారుకి కంకణ ధారణ చేశారు. రాత్రి 8 గం"లకు బెంగుళూరు వాస్తవ్యులు ఆర్. శాంతారామ్, ప్రసాద్, దిలీప్ కుటుంబ సభ్యులచే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 10 గం"లకు, రఘురామ్ బృందంచే బుర్రకథ, కథానంతరము అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త లక్ష్మీ తులసి మాట్లాడుతూశ్రీ కావమ్మ ఆలయ ఆవరణము నందు నూతనముగా నాగ, శివలింగ, నంది, నవగ్రహ ప్రతిష్ఠకు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నాగాసన, శివాలయ, నవగ్రహ మండపాల నిర్మాణానికి భక్తులు చందాలను విరివిగా ఇచ్చి ఆలయ అభివృద్ధికి పాత్రులు కాగలరని కోరారు.






## పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో స్టేట్ ర్యాంక్ సాధించిన మోక్షితకు ఘన సన్మానం



**పలమనేరు, మేజర్‌న్యూస్:** ఉమ్మడి చిత్తూరు జిల్లా యాదవ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో పదవ తరగతి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు సన్మాన కార్యక్రమం చిత్తూరులోని స్థానిక టిటిడి కళ్యాణ మండపం నందు సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం, ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్ కుమార్తె జి మోక్షిత యాదవ్ పలమనేరులోని నారాయణ పాఠశాల లో చదివి ఎస్.ఎస్. సి నందు 600 /593 స్టేట్ ర్యాంక్ సాధించడం గర్వకారణమని మన ఊరు వక్తలు కొనియాడారు. పలువురు ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని ఈమెతోపాటు సుమారు మూడు మందికి సన్మానం చేయడం జరిగిందన్నారు. ఆ విద్యార్థినికి మెమొంటోతో పాటు ప్రశంస పత్రం అందించడం జరిగిందని వారి తల్లిదండ్రులు తెలిపారు. ఆ విద్యార్థినికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత నేత్ర చికిత్స శిబిరానికి విశేష స్పందన

**పలమనేరు, మేజర్‌న్యూస్:** స్థానిక రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ వారి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర చికిత్స శిబిరం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వారికి కంటి పరీక్షలు నిర్వహించి 60 మంది గాను 37 మందిని ఎంపిక చేసినట్లు డాక్టర్ మురళి తెలిపారు. కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారికి చెన్నైకు తీసుకువెళ్లి కంటి ఆపరేషన్లు నిర్వహించి వారి స్వస్థలాలకు చేర్చడం జరుగుతుందన్నారు. కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారు తమ వెంట దుప్పటి ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని వారు తెలిపారు.



## రక్తదానం ఒక బాధ్యత - ఆర్డీఓ భాను ప్రకాష్‌రెడ్డి

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం యువతరం సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో 58 మంది యువకులు విచ్చేసి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ఆర్డీవో చేతులు మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ యువతరం సేవా సమితి వారు గత పది సంవత్సరాలుగా వేసవి కాలంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయడం ఒక బాధ్యతగా భావించి ముందుకు రావాలని కోరారు. రక్తదానం చేయడం ఒకరి ప్రాణాన్ని నిలబెట్టడం అని ఆయన తెలియజేశారు. యువతరం సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ వేసవి కాలంలో రక్త కొరతతో ప్రాణాలు విడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండలు ఎక్కువగా ఉండడం చేత రక్తదాన శిబిరాలు తక్కువగా ఉండడం వలన ఈ కొరత ఏర్పడుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని గత కొన్ని సంవత్సరాలుగా వేసవికాలంలోనే రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ వేసవిలో రక్తదానం చేయడానికి వచ్చిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది రాజేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు స్వర్ణ మూర్తి, కల్పన యువతరం సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.






## మహిళా క్రికెట్ టోర్నమెంట్‌లో బెస్ట్ బ్యాట్స్ ఉమెన్ అవార్డు కైవసం చేసుకున్న కళ్యాణి



**పుంగనూరు, మేజర్ న్యూస్:** నియోజకవర్గంలోని చౌడేపల్లి మండలం దిగువపల్లె గ్రామం బోయకొండ మాజీ చైర్మన్ కంచం శివప్ప నాయుడు తృతీయ కుమార్తె కళ్యాణి శనివారం మాదాపూర్ హైదరాబాద్ జెటిఎక్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో పలు కంపెనీలతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు జె.టి.ఎక్స్ క్రికెట్ టోర్నమెంట్ నందు కళ్యాణి ఆట తీరు ప్రేక్షకులను అకట్టు కొన్నది టీమ్‌లో బెస్ట్ బ్యాట్స్ మాన్ అవార్డు కైవసం చేసుకొన్నది. ఈమె చౌడేపల్లి పుంగనూరు మదనపల్లి నందు విద్యనభ్యసించారు మిట్స్ కళాశాలలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ కోర్స్ పూర్తి చేసి హైదరాబాద్ సాఫ్ట్ వేర్ కంపెనీ నుండి అమెరికాలో ఉద్యోగం నిర్వహించి అనంతరం హైదరాబాద్ జె.ఎక్స్.టి సాఫ్ట్ వెర్ కంపెనీలో ఉన్నత స్థాయి ఉద్యోగం నిర్వహిస్తున్నారు. క్రికెట్‌లో కప్ కైవసం చేసుకొన్నా విషయం తెలిసి మాజీ ఎం ఎల్ సి రెడ్డెప్ప రెడ్డి మాజీ న్యాయమూర్తి స్వర్ణలత హైకోర్టు న్యాయవాదులు వైద్యులు కళ్యాణికి అభినందనలు తెలియజేసారు.

## అనారోగ్యంతో టీడీపీ నాయకుడి మృతి

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** మండలంలోని కొల్లాగుంట గ్రామంలో సుకుమార్ శెట్టి టీడీపీ సీనియర్ నాయకులు అనారోగ్యంతో మరణించారు. మృతదేహానికి ఎమ్మెల్యే అన్న రాజ, మండల పార్టీ అధ్యక్షులు చంగల్రాయల్ యాదవ్, మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి ఎనలేని కృషి చేశారన్నారు వీరి సేవలు మరువలేవన్నారు. దేహానికి తెలుగు రాష్ట్ర రైతు కార్య నిర్వాహక కార్యదర్శి జనార్దన్ రాజు, రవి యాదవ్, పవన్, వరదరాజు, సందాని, ప్రసాద్, పరందాము, రుక్కు బాబు, సుమన్, రాజ గంగయ్య గ్రామస్తులు సంతాపం తెలిపారు.





## యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**చిత్తూరు ప్రతినిధి, మేజర్ న్యూస్:** ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో చిత్తూరు జిల్లాలో 500 కన్న ఎక్కువ సాధించిన యాదవ విద్యార్థి, విద్యార్థినులకు ఆదివారం నగరంలోని స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో యాదవ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా యాదవ ఉద్యోగుల సొసైటీ జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి యాదవ్ మాట్లాడుతూ గతంలో ఈ పురస్కారాలు కొన్ని ప్రాంతాలకే పరిమితమై ఇచ్చే వాళ్ళమని. ఈ పర్యాయము జిల్లా వ్యాప్తంగా విద్యార్థులను గౌరవించాలని ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుందని మా సొసైటీ ద్వారా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు లింగమూర్తి తెలిపారు.యాదవ్ ఎంప్లాయిస్ సొసైటీ గౌరవ అధ్యక్షులు చిట్టిబాబు కొల్లా ముఖ్య అతిథులుగా విచ్చేసి, జీవితంలో పైకి ఎదగాలంటే క్రమశిక్షణ, నిబద్ధత, జ్ఞాన సముపార్జన, సాధన ముఖ్యమైన అంశాలని, వాటిని విద్యార్థులు నిరంతరం పాటించాలని కోరారు. పదవ తరగతి విద్యారంగంలో మొదటి మెట్టు, ఈ స్థాయిలో మంచి ప్రతిభను కనబరిచినందుకు మిమ్మల్ని అందరిని అభినందిస్తున్నాను అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు కవితా సురేష్, కోదండ యాదవ్, అశోక్ ఆనంద్, నాగరాజ్ యాదవ్, నవీన్ యాదవ్, శ్రీరామ్మూర్తి, చంగల్రాయ మందడి, ఎస్ ప్రతినిధులు లక్ష్మీపతి యాదవ్, కుమారయ్య,, వెంకటయ్య యాదవ్, విక్రమన్, గురు ప్రసాద్, దేవేంద్ర, గురుమూర్తి, వెంకటేష్ యాదవ్, గోవిందస్వామి, ఢిల్లీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. 200 మంది విద్యార్థులకు మెమెంటో, సర్టిఫికెట్, ఫైల్, కెరీర్ గైడెన్స్ పై భవిష్య మార్గదర్శనం అనే పుస్తకం ఇవ్వడం జరిగింది. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## దివ్యాంగులకు నిత్యావసరాలు సరుకులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బొజ్జల

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ దివ్యంగులుకు ఉచిత సరుకులు పంపిణీ కార్యక్రమానికి శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి విచ్చేశారు. ఈ కార్యక్రమానికి బొజ్జల కుటుంబ సభ్యులు బొజ్జల బృందమ్మ, బొజ్జల రిషిత రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఈ సంస్థకు సహాయ సహకారాలు అందిస్తామని వీరు మరింత మెరుగ్గా అందరికీ సేవ చేయాలని తెలిపారు. దివ్యాంగులకు నిత్యవసరాలు సరుకులు పంపిణీ చేయడం మంచి విషయమని. ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి పట్టణం తెలుగుదేశం పార్టీ నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

## అలరించిన దుర్యోధన వధ, అగ్నిగుండ ప్రవేశం



**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** మండలంలోని అమ్మపల్లి పంచాయతీలో వెలసిన ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయంలో ఆదివారం ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేక ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పొంగల్‌లో పెట్టి నైవేద్యం సమర్పించారు దుర్యోధన వద ఘట్టాన్ని వేషధారణ మహాభారత చివరి ఘట్టాన్ని ఆలయం వద్ద నిర్వహించారు. రాత్రి అగ్గి గుండె ప్రవేశాన్ని అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు భక్తులు కమిటీ సభ్యులు సీఐ హనుమంతప్ప ఎస్సై రాజ్ కుమార్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వైకాపా కార్యకర్త సీమంతంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** పట్టణ వైయస్సార్ పార్టీ నేత, శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ప్రత్యేక ఆహ్వానిత సభ్యుడు పవన్ కుమార్ భార్య సీమంతం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి, శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ నియోజవర్గం యువత అధ్యక్షులు శ్రీవారి సురేష్, మాజీ కౌన్సిలర్ కంటా ఉదయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మమ్మ మృతదేహానికి నివాళులర్పించిన జనసేన నాయకుడు



కార్వేటినగరం మేజర్‌న్యూస్: కార్వేటినగరం పంచాయతీ, కోటచెరువు హరిజనవాడ గ్రామం చెందిన లక్ష్మమ్మ మృతదేహానికి ఏపీ మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, స్టేట్ డైరెక్టర్ మరియు జనసేన పార్టీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న పూలమా వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో..జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవ, మండల అధ్యక్షులు ఉసురుపాటి విజయ్, కార్వేటినగరం టౌన్ అధ్యక్షులు రాజేష్, ఉపాధ్యక్షులు సూర్య నరసింహులు, ప్రధాన కార్యదర్శి మణికంఠ పాల్గొన్నారు.

## నగరిలో గాలి వాన



**నగరి, మేజర్‌న్యూస్:** నగరిలో ఈదురు గాలితో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షం వల్ల తీవ్ర మండుఎండలో అల్లాడుతున్న ప్రజలకు కొంత మేరకైనా చల్లగా వాతావరణం వుండడంతో తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. రాత్రి పూట పడడంతో ప్రశాంతంగా నిద్ర పడుతుందన్నారు.

## కృపా లక్ష్మిని కలిసిన వైసిపి నేతలు



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** గంగాధర్ నెల్లూరు నియోజక వర్గ వైసీపీ సమన్వయకర్త కృపా లక్ష్మిని వెదురుకుప్పం వైసీపీ నేతలు ఆదివారం విజయవాడలోని ఆమె స్వగృహం లో మర్యాదపూర్వకంగా కలిశారు. మే 17న వైఎస్ఆర్సిపి నాయకులు పురందరెడ్డి చెల్లెలు పుత్తూరు ధరణి వివాహానికి రావలసినదిగా ఆహ్వానం అందజేశారు. కృపా లక్ష్మిని కలిసిన వారిలో పెరుమాళ్ళపల్లి ఎంపీటీసీ సభ్యులు తోకల మురళి రెడ్డి, వెదురుకుప్పం వైసిపి నాయకులు పుత్తూరు పురందరెడ్డిలు ఉన్నారు.

## తల్లి దండ్రులకు ఇష్టం లేని పెళ్లి చేసుకుందని అక్కపై చెల్లెలు దాడి

బంగారుపాళ్యం, మేజర్‌న్యూస్: మండలంలోని కాటప్పగారిపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ పలమనేరుకు చెందిన ముస్లిం యువతని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. పలమనేరుకు చెందిన మునీష్ బాషాకు ఇద్దరు కూతుర్లు. పెద్ద కుమార్తె చాందినిని ఒక నెల రోజులకు మునుపు ప్రేమించి పెళ్ళి చేసుకొన్నాడు. ఈ పెళ్లి ఇష్టం లేదని చాందిని స్వంత చెల్లెలు తస్మియా ఆదివారం ఉదయం 9:30 గంటల ప్రాంతంలో కాటప్పగారిపల్లిలో రాజశేఖర్ ఇంటిలో తన అక్క చాందినిపై అలాగే రాజశేఖర్‌పై కత్తితో దాడి చేసి ఇద్దరిని గాయపరిచింది. బాధితుడు రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మండల ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పిల్లలకు పుస్తక పఠనాన్ని అలవాటు చేయాలి

**పలమనేరు, మేజర్‌న్యూస్:** స్థానిక ప్రభుత్వ గ్రంథాలయంలో ఆదివారం ఉదయం గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం ప్రత్యేక సదస్సు పలమనేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగింది. గ్రంథాలయాల అభివృద్ధికి గ్రంథాలయాలలో పాఠకుల సంఖ్యను పత్రికలు,పుస్తకాల సంఖ్యను పెంచటానికి తీసుకోవాల్సిన చర్యల గురించి రచయితలు చర్చించారు. గ్రంథాలయ సభ్యత్వ రుసుం రచయితలు మిఠాయి యుగంధర్ బాబు,గిరిధర మూర్తి,రైతు నాయకులు ఉమాపతి, రసజ్ఞుల సమాఖ్య అధ్యక్షులు శ్రీపురం సీతారామయ్య గ్రంథాలయాధికారి హేమ కుమార్ కు అందజేశారు. గ్రంథాలయాల అభివృద్ధికి పుస్తకాల సేకరణతో పాటు ఒక ఉద్యమం లాగా గ్రంథాలయ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పలమనేరు రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు ఆర్.మాధవ్ తెలిపారు. గ్రంథాలయ పునర్వికాసానికి తీసుకోవలసిన చర్యల గురించి రచయితలు జొన్నవిత్తుల శ్రీరామచంద్ర మూర్తి, చంద్రశేఖరయ్య తదితరులు సూచనలు ఇచ్చారు.యువతరం విలువైన పుస్తకాలను చదవటానికి, తద్వారా వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవటానికి, మానవ సంబంధాలను పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు తప్పనిసరిగా సందర్శించవలసిన దేవాలయాలు అని పాఠకుల తరపున ప్రసంగించిన డాక్టర్ జయవర్ధన్ అన్నారు.గ్రంథాలయానికి సాహిత్య పత్రికలను పంపిణీ చేసేందుకు ఐదువేల రూపాయలు చందాను విరాళంగా చెల్లించిన బైరెడ్డిపల్లి మహతి ఫౌండేషన్ వారికి రచయితలు ధన్యవాదాలు తెలిపారు.మరో గ్రంథాలయ ఉద్యమ నేత రచయిత మంచికంటి గ్రంథాలయ వికాసానికి చేపట్టవలసిన చర్యల గురించి రాసిన పరిశోధనాత్మక



పుస్తకం సమాజానికి బహిరంగ లేఖ పుస్తకాన్ని ఆర్.మాధవ్ ఆవిష్కరించారు.ప్రజాప్రతినిధులు అధికారులు రచయితలు ప్రజలు విద్యార్థుల భాగస్వామ్యంతో గ్రంథాలయ అభివృద్ధికి నిరంతరం చర్యలు చేపడుతున్నామని తెలియజేస్తూ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమంలో అందరూ భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి హేమకుమార్ పిలుపునిచ్చారు. 6వ తేదీ వరకు విద్యార్థులకు ప్రత్యేక వేసవి శిక్షణా శిబిరం కొనసాగుతుందని ఆయన తెలిపారు.విద్యార్థుల్లో సృజనాత్మక శక్తులను పెంపొందించడానికి సాహిత్య సాంస్కృతిక అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి వివిధ రంగాలలో పోటీలు నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక నాయకులు మిఠాయి యుగంధర్ బాబు, గిరిధరమూర్తి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు శ్రీపురం సీతారామయ్య తెలిపారు.

## క్రికెట్ టోర్నమెంట్ విజేతగా పెద్ద తయ్యూరు జట్టు

**ఎస్ఆర్‌పురం, మేజర్‌న్యూస్:** మండలంలోని యుఎం పురం గ్రామంలో నిర్వహించిన సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా పెద్ద తయ్యూరు జట్టు విజేతగా నిలిచి 40 వేల రూపాయలు గెలుపు పొందింది.



సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌లో యుఎం.పురం క్రికెట్ జట్టుపై పెద్దతయ్యూరు జట్టు విజయం సాధించింది. విన్నర్ జట్టుకు 40,000 రూపాయలు, రన్నర్ జట్టుకు 20వేల రూపాయలు బహుమతితో పాటు మెడల్స్ కప్పును అందించారు. గెలుపొందిన పెద్ద తయ్యూరు జట్టుకు ఆ గ్రామంలో మంగళ హారతులతో బాణా సంచులతో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ వరదమ్మ గెలుపొందిన క్రీడాకారులు సన్మానించి అభినందించారు. మానసిక మానసిక ఉల్లాసంతో పాటు యువతుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్ దోహదపడతాయని అన్నారు. పంచాయతీ స్థాయిలో క్రీడ మైదానానికి కృషి చేస్తారని సర్పంచ్ వరదమ్మ క్రీడాకారులకు హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు, యువకులు అందరూ కలిసి ఉత్సాహంగా చిందులేశారు.

## డాక్టర్ ఆర్ కె రెడ్డికి అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు

**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్:** ఆర్‌కె అబాకస్ ఎడ్యుకేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి అబాకస్ నందు అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డును హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన జూబ్లీహిల్స్ నందు ఎఎఎ (ట్రిపుల్ ఎ )అబాకస్ వారి ఆధ్వర్యంలో అంగుళ్లియా అర్థమేటిక్స్ పైన శిక్షణ అనంతరం 20వ ఇంటర్నేషనల్ అబాకస్ కాంపిటేషన్స్ నిర్వహనకు ట్రిపుల్ ఎ ఇన్స్టిట్యూషన్స్ ఫౌండర్ గంగాధర్ ను ఆహ్వానంతో పాటు ఆర్ కె రెడ్డి అవార్డును అందుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ రోజు గంగాధర్ తో పాటు తిరుపతి ఆర్. కె అబాకస్ ఎడ్యుకేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం అకాడమిక్ ఎక్సలెంట్ అవార్డు ను అందుకోవటం జరిగినది. రాబోయే రోజుల్లో సైనిక్ నవోదయ కాంపిటీషన్ ఎగ్జామ్స్ పై దృష్టితో అంగులియా అర్థమెటిక్ అబాకస్ శిక్షణ తిరుపతి నందు కూడా ప్రారంభిస్తే బాగుంటుందని ఈమధ్య మన ప్రధాని నరేంద్ర మోడీ కూడా వేదిక్ మ్యాథమెటిక్స్ వేద అబాకస్ పై అవగాహన కలిగి ఉండాలని, శిక్షకులకు విద్యార్థులకు ఢిల్లీలో కార్యక్రమంలో తెలిపారు.రాబోయే రోజుల్లో కూడా గణితంలో పట్టు ఉంటే ఏ సబ్జెక్ట్ అయినా అవలీలగా చేయగలరని వరల్డ్ అబాకస్ ట్రైనర్ గంగాధరం" తెలిపారు గంగాధర్ తిరుపతి నందు కూడా ఆర్. కె అబాకస్ సంస్థ ఆధ్వర్యంలో 10 చేతివేళ్లతో క్యాలిక్యులేటర్ కంటే వేగంగా లెక్కలు చేయడం, చేతివేళ్లలో 1 నుండి 1000 మల్టిప్లికేషన్ టేబుల్స్ ను పెన్ను పేపర్ లేకుండ వితిన్ సెకండ్స్ లో చెప్పగలరు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా బీసీ జనరల్ సెక్రటరీ అనగాని రెడ్డెప్ప, ఆర్. కె అబాకస్ సభ్యులు అశోక్ రెడ్డి, కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.



## వేషాలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



**తిరుపతి, మేజర్‌న్యూస్:** తిరుపతి పల్లి వీధిలోని వేషాలమ్మ జాతర పోస్టర్ ను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి, శ్రీ తాతయ్యగుంట గంగమ్మ గుడి ఉత్సవ కమిటీ సభ్యులు మబ్బు దేవనారాయణ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆదివారం మబ్బు దేవ నారాయణ రెడ్డి కార్యాలయంలో వేషాలమ్మ గుడి ఇరికి ముని శేఖర్ రెడ్డి, తిరుపతి కోపరేటివ్ టౌన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ ఆర్ ముని రామయ్య లు వేషాలమ్మ జాతరను పురస్కరించుకొని పోస్టర్ ను మబ్బు దేవ నారాయణ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. వేషాలమ్మ జాతర ఈనెల ఆరో తేదీ నుంచి 13వ తేదీ వరకు జరగనుంది. ఇప్పటికే వేషాలమ్మ ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు చేపడుతున్నట్లు ఆలయ ఈవో ఇరికి మునిశేఖర్ రెడ్డి తెలిపారు.

## ఘనంగా కెవి నాయుడు జన్మదిన వేడుకలు



**పెళ్లకూరు మేజర్‌న్యూస్ :** మండలంలోని రావులపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ రైతు విభాగ కార్యదర్శి కొచర్ల వెంకట రమణ నాయుడు అలియాస్ కెవి నాయుడు జన్మదిన వేడుకలు గ్రామంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన అయన అభిమానులు భారీ ఎత్తున కేక్ కట్ చేసి అయన హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియ చేసారు.ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భగవంతుడుని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ఆయన అభిమానులు సుధీర్,తిలక్ బాబు,పండు, జానీ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో జోరు వాన

(మొదటిపేజీ తరువాయి)

వర్షం కురిసిందని భక్తులు, నగర వాసులు చెబుతున్నారు.

## పొంగి పొర్లిన డ్రైనేజ్ కాలువలు...

తిరుపతిలో జోరుగా వర్షం పడటంతో నగరంలోని డ్రైనేజీ కాలువలన్నీ మురుగునీరు రోడ్లపై పొంగి పోర్లాయి. దీంతో వాహనదారులు తీవ్ర అసౌక ర్యానికి గురయ్యారు. ఒక్కసారిగా భారీ వర్షం కురియ డంతో నగరంలోని డ్రైనేజీ కాలువలు అన్ని మురుగు నీటితో పొంగి పొర్లాయి. ఇళ్ల మధ్యలో మురుగునీరు రోడ్లపై రావడంతో ఆ కంపుకు భరించలేక నివాస గృహాల ప్రజలు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొంతమంది ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. మరికొన్ని నాలుగు చక్రాల వాహనాలు నీళ్లలో ఇరుక్కుపోయాయి. చిరు వ్యాపారులకు వర్షం తీవ్ర అంతరాయాన్ని కలిగించింది.

## వర్షంతో చల్లబడ్డ తిరుపతి నగరం..

దాదాపు మూడు నెలల తర్వాత తిరుపతిలో మూడు గంటల పాటు భారీ వర్షం కురవడంతో నగరం చల్లబడింది. వాతావరణం లో కూడా మార్పు వచ్చింది. నగర ప్రజలకు ఉక్క పోత నుండి ఉపశమనం కలిగింది. నగరంలోని ప్రాంతాలలో ఈదురు గాలుల వల్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి.

## 3 గంటల పాటు విద్యుత్ అంతరాయం

తిరుపతిలో ఎడతెరిపి లేకుండా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం మూడు గంటల పాటు పడింది. దీంతో నగరంలో మూడు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఒకపక్క వర్షం పడుతుండడంతో విద్యుత్తు లేకపోవడంతో ప్రజలు నిస్సహాయ ఇళ్ల ముందు బయటకు వచ్చి చివరకు ఆ వర్షాన్ని ఆస్వాదిస్తూ ఉండి పోయారు. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మరికొన్నిచోట్ల విద్యుత్ తీగలు తెగి పడటంతో పాటు ట్రాన్స్ఫార్మర్లు పేలిపోయాయి. దీంతో విద్యుత్ శాఖకు సుమారు కోటి రూపాయలు దాకా నష్టం వాటిల్లి ఉండవచ్చని ఆ శాఖ అధికారి తెలిపారు.

## వర్షంతో రోడ్డును పడ్డ చిరు వ్యాపారులు

ఒక్కసారిగా తిరుపతిలో మూడు గంటల పాటు భారీ వర్షం కురవడంతో రోడ్లపైన చిరు వ్యాపారాలు చేసుకునే వారికి తీవ్ర అంతరాయం కలిగింది. ఆదివారం కావడం తో చాలామంది రోడ్లపైకి వచ్చి కొనుగోలు చేస్తుంటారని, వర్షం రాకతో అంతా ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో చిరు వ్యాపారులు వ్యాపారాలు జరగక సరుకు నిలబడి పోవడంతో చిరు వ్యాపారులు దిగాలు పడ్డారు. ఏది ఏమైనా ఉక్కపోతతో అల్లాడిపోతున్న తిరుపతి వాసులకు భారీ వర్షంతో ఉపశమనం కలిగిందని చెప్పవచ్చు.





# శ్రీదుర్గ మృతిపై పూర్తి విచారణ చేయిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ నాయకులు శ్రీ దుర్గా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీసీ నేత షణ్ముగం, శ్రీ దుర్గ పిల్లలు, ఆమె భర్తను పలకరించి తెలుగుదేశం పార్టీ శ్రీదుర్గా కుటుంబ సభ్యులకు అండగా ఉంటుందని వారిని ఆదుకుంటుందని తెలిపారు. అనంతరం మంత్రి స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ గత నెల 21వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగుదేశం పార్టీ మహిళా విభాగ పార్లమెంట్ కార్యదర్శి శ్రీ దుర్గా మరణం పార్టీకి తీరని లోటని ఆమె అకాల మరణం పార్టీ జీర్ణించుకోలేక పోయింద న్నారు. పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఆమె లేని లోటు తీరలేనిది అన్నారు. అలాగే ప్రమాదం జరిగిన వెంటనే ఆమె తండ్రి షణ్ముగం కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారని అయితే అక్కడ విధులు నిర్వహిస్తున్న లీజు యాజ మాన్యం అపోలో వైద్యులు శ్రీదుర్గాకు సరైన వైద్యం అందించకుండా నిర్లక్ష్యం గా వ్యవహరించి ఎలాంటి ప్రమాదం లేదని చెప్పడం జరిగిందన్నారు. వారి మాటలను నమ్మకుండా తమ కుమార్తెకు ఆసుపత్రిలో అందుబాటులో ఉండే సిటీ స్కాన్ తీయాలని చెప్పిన వారు వినకుండా మీ బిడ్డకు ఎలాంటి ప్రమాదం లేదని నమ్మకంగా చెప్పడంతో నమ్మి శ్రీదుర్గా కుటుంబ సభ్యులు ఆసుపత్రి నుండి ఇంటికి తీసుకెళ్లడం జరిగింది అన్నారు. అయితే ఆసుపత్రి నుండి వెళ్లిన 18 గంటల్లో శ్రీదుర్గా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో మళ్లీ అపోలో వైద్యుల కు చూపించడంతో అప్పటికే ఆమె మృతి చెందిందని చెప్పడం జరిగిందని ఆమె మృతికి తలకు బలమైన గాయాలు కారణమని చెప్పినట్లు వారి కుటుంబ సభ్యులు తెలియజేశారన్నారు. అయితే శ్రీ దుర్గా కుటుంబ సభ్యుల ఆరోపణలు మేరకు అపోలో వైద్యుల నిర్లక్ష్యంపై పూర్తిస్థాయి విచారణకు ఇప్పటికే ప్రభు త్వం ఆదేశించినట్లు నివేదిక ఆధారంగా శ్రీ దుర్గా మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ సైతం శ్రీదుర్గా మృతిపై తక్షణం స్పందించి సీఎమ్ఓ కార్యాలయం లో జరిగిన విషయాన్ని నివేదిక రూపంలో ఇచ్చామన్నారు. అలాగే ప్రభుత్వ విచారణ అనంతరం వచ్చే నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. అనంతరం బిడ్డను పోగొట్టుకున్న తండ్రిగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్చార్జ్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షణ్ముగం, హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు చేపట్టిన అపోలో వద్దు ప్రభుత్వాసుపత్రి ముద్దు అనే కార్యక్రమంలో భాగంగా వారి సేకరిస్తున్న సంతకాలపుస్తకంలో మంత్రి కొల్లు రవీంద్ర, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌లు సంతకాలు చేశారు. సీనియర్ నాయకులు, వసంత్‌కుమార్, బాలాజీ, మోహన్‌రాజ్, కోదండరామ్, మాజీ కార్పొరేటర్లు, మహిళ నాయకులు, బీసీ సంక్షేమ సంఘం సభ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





జనం కోసమే
నేటి దినపత్రిక సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం. మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116